దుగ్గొండి: తిమ్మంపేటలో సర్వే వివరాలు తెలుసుకుంటున్న కలెక్టర్ సత్య శారద

పారదర్శకంగా సర్వే నిర్వహించాలి

- ప్రభుత్వం అందించిన జాబితా ప్రకారం సర్వే
- పేర్లు రాని వారు గ్రామసభల్లో దరఖాస్తు చేసుకోవాలి
- కలెక్టర్ సత్య శారద
- పలు గ్రామాలను సందర్శించిన అధికారుల బృందాలు

గీసుగొండ/దుగ్గొండి, జనవరి 19: ప్రభుత్వ పథకాలను లబ్ధిదారులకు అందించేందుకు చేపట్టిన సర్వేను పారదర్శకంగా చేపట్టాలని కలెక్టర్ సత్యశారద అధికారులను ఆదేశించారు. గీసుగొండ మండలంలోని వంచనగిరి, ఊకల్‌లో ఆదివారం ఆమె ప్రభుత్వ పథకాల అమలు కోసం చేస్తున్న సర్వేను పరిశీలించి సిబ్బందికి సూచనలు చేశారు. గీసుగొండ మండలంలోని 21 గ్రామాల్లో 598 మంది, గ్రేటర్ వరంగల్ 15, 16వ డివిజన్‌లో 316 మందికి రేషన్ కార్డులు లేవని గుర్తించి ప్రభుత్వం జాబితా పంపించిందన్నారు. ప్రభుత్వం ఇచ్చిన జాబితా ప్రకారం గ్రామాల్లో అధికారులు సర్వే చేస్తున్నట్లు చెప్పారు. పేర్లు రానివారు గ్రామసభల్లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. సర్వేకు వచ్చే అధికారులకు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో జడ్పీ సీఈవో రాంరెడ్డి, జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి కిష్టయ్య, తహసీల్దార్ రియాజుద్దీన్, మండల ప్రత్యేక అధికారి సురేశ్, ఎంపీడీవో కృష్ణవేణి, ఎంపీవో ప్రభాకర్ పాల్గొన్నారు. అలాగే, దుగ్గొండి మండలంలోని తిమ్మంపేటలో చేపట్టిన సర్వేను కలెక్టర్ సత్య శారద తనిఖీ చేసి సిబ్బందికి సూచనలు చేశారు. రేషన్ కార్డుల జాబితాలో పేర్లు రానివారు ఆందోళన చెందొద్దని, మళ్లీ దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో నర్సంపేట ఆర్డీవో ఉమారాణి, ఎంపీడీవో లెక్కల అరుందతి, తహసీల్దార్ రవిచంద్రరెడ్డి, ఎంపీవో శ్రీధర్‌గౌడ్, కార్యదర్శి శశిధర్, పాల్గొన్నారు.

వివరాలు పక్కాగా నమోదు చేయాలి

నల్లబెల్లి/పర్వతగిరి/గీసుగొండ: ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, రైతు భరోసా, రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇండ్ల పథకాల సర్వే వివరాలను పక్కాగా నమోదు చేయాలని అదనపు కలెక్టర్ సంధ్యారాణి సూచించారు. మండలంలోని నందిగామ, రంగాపురంలో ఆమె పర్యటించి సర్వే వివరాలను సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. అర్హులకు పథకాలు అందేలా కృషి చేయాలని అధికారులకు సూచించారు. కార్యక్రమంలో మండల ప్రత్యేక అధికారి గోవిందరాజన్, తహసీల్దార్ ముప్పు కృష్ణ, ఎంపీడీవో నరసింహమూర్తి తదితరులు పాల్గొన్నారు.

అంతేకాకుండా పర్వతగిరి ఎంపీడీవో కార్యాలయంలో అదనపు కలెక్టర్ వివిధ శాఖల అధికారులతో సమీక్షించారు. ప్రభుత్వ పథకాల సర్వే తీరుపై సభ్యులకు సూచనలు చేశారు. కార్యక్రమంలో తహసీల్దార్ వెంకటస్వామి, ఎంపీడీవో శంకర్‌నాయక్, ఏవో ప్రశాంత్‌కుమార్, ఎంపీవో శ్రీనివాస్ పాల్గొన్నారు. అంతేకాకుండా గీసుగొండ తహసీల్దార్ రియాజుద్దీన్ మాట్లాడుతూ రేషన్‌కార్డుల దరఖాస్తుల స్వీకరణ నిరంతర ప్రక్రియ అని, జాబితాలో పేర్లు రాని వారు అధైర్య పడొద్దని సూచించారు.

కోటలో కళాఖండాలపై పిచ్చి రాతలు

ప్రేక్షక పాత్ర పోషిస్తున్న కేంద్ర పురావస్తు శాఖాధికారులు

ఏకశిలగుట్టపై ఆర్ట్ వేసిన ప్రేమికులు

ఖిలావరంగల్, జనవరి 19: చారిత్రక శిల్పాలపై వెర్రెక్కిన ప్రేమతో కొందరు ప్రేమ గుర్తులు, పిచ్చి రాతలను గీస్తున్నారు. వెయ్యేళ్ల కాకతీయ చక్రవర్తుల పౌరుషానికి, సంస్కృతీ సంప్రదాయానికి నిలువెత్తు నిదర్శనమైన చారిత్రక కట్టడాలను భావితరాలకు అందించాల్సిన బాధ్యతను విస్మరించిన కేంద్ర పురావస్తు శాఖాధికారులు ప్రేక్షకపాత్ర పోషిస్తున్నారు. దీంతో ప్రేమికులు తన ఆనందం కోసం పిచ్చిపట్టినట్లు ప్రవర్తిస్తూ కట్టడాలపై పిచ్చిగా ముద్రలు వేస్తుంటే అడ్డుకొని కాపాడాల్సిన అధికారులు ఏమీ పట్టనట్టు వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు సర్వత్రా వినిపిస్తున్నాయి. ఖిలావరంగల్ రాతికోట ఉత్తర, పశ్చిమ ద్వారాల వద్ద, ఏకశిలగుట్టపై ఉన్న ఆలయాల గోడలు, స్తంభాలపై ప్రేమికులు రంగులు తీసుకొచ్చి ప్రేమ గుర్తులు, వారి పేర్లను ఆర్ట్ వేస్తున్నారు. అలాగే, గుట్టపై ఉన్న బురుజు, కీర్తితోరణాల మధ్యలో ఉన్న ఆలయంలో రంగులతో ప్రేమ గుర్తులు వేయడమే కాకుండా రాళ్లపై తమ పేర్లు చెక్కుతున్నారు. కొంతమంది కోట గోడలపై బోర్‌వెల్, సెప్టిక్ ట్యాంక్ క్లీన్ వంటి యాడ్స్‌ను పెయింటింగ్‌తో వేస్తున్నారు. దీంతో శోభాయమానంగా కనిపించే కళాఖండాలు కళావిహీనంగా మారిపోతున్నాయని పర్యాటకులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పిచ్చి రాతలను అడ్డుకోవాల్సిన సెక్యూరిటీ సిబ్బంది తుడిస్తే పోతుందని చెప్పడం గమనార్హం. అధికారులు స్పందించి చారిత్రక కట్టడాలను పరిరక్షించాలని స్థానికులు, పర్యాటకులు కోరుతున్నారు.


రాతికోట ఉత్తర ద్వారంపై ఉన్న పిచ్చిరాతలు

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్

WANTED

★60 రకాల వెజ్ & నాన్‌వెజ్ పచ్చళ్ళు కిరాణా షాపులకు, కర్రీపాయింట్లకు, బేకరీషాపులకు, హోటల్స్‌లకు సప్లై చేయడానికి బైక్ కలిగిన యువకులు మండలానికి ఒకరు కావలెను. సెల్: 8143909459
KMM

గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

For Classified Ads
Please Contact...
9182777552
HANAMKONDA
9182777563
9182777961
WARANAGAL
9182777556
JAYASHANKAR BHUPALPALLY
9182777135
MULUGU
9182777135
MAHABUBABAD
9182777557
JANGAON
9182777565

విద్యుదాఘాతంతో యువ రైతు మృతి

గోపీ(ఫైల్)

రాయపర్తి, జనవరి 19: విద్యుదాఘాతంతో యువరైతు మృతి చెందిన ఘటన ఆదివారం సాయంత్రం మండలంలోని అవుసులకుంటతండాలో జరిగింది. స్థానికుల కథనం ప్రకారం.. ఏకేతండాకు చెందిన రైతు ధారవత్ గోపీనాయక్(27) తమ పొలంలో కూలీలు వరి నాటు వేస్తుండగా, అడుగు మందు చల్లుతున్నాడు. ఈ క్రమంలో పొలంలో కిందకు వేలాడుతున్న విద్యుత్ సర్వీస్ వైర్లు గోపీనాయక్ చేతిలో ఉన్న అల్యూమినియం డబ్బాకు తాకాయి. దీంతో విద్యుత్ షాక్‌కు గురైన అతడు అక్కడికక్కడే మృతి చెందాడు. గోపీకి భార్య లలిత ఉంది. తండ్రి హనుమానాయక్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై కొంగ శ్రవణ్‌కుమార్ తెలిపారు.

ఎడ్ల బండిని ఢీకొట్టిన ట్రావెల్స్ బస్

గీసుగొండ, జనవరి 19: ఎడ్ల బండిని ట్రావెల్స్ బస్ ఢీకొట్టిన ఘటనలో రైతుకు తీవ్ర గాయాలైన ఘటన మండలంలోని హర్జ్యతండా శివారులో ఆదివారం రాత్రి జరిగింది. ఎస్సై ప్రశాంత్ కథనం ప్రకారం.. హర్జ్యతండాకు చెందిన రైతు ఆంగోత్ వీరన్న తన వ్యవసాయ పొలం వద్ద పనులు ముగించుకొని రాత్రి 7 గంటలకు ఎడ్ల బండిపై ఇంటికి వస్తున్నాడు. నర్సంపేట వైపు నుంచి వరంగల్‌కు వెళ్తున్న జ్యోతి ట్రావెల్స్ బస్ వెనుక నుంచి ఎడ్ల బండిని ఢీకొట్టింది. బండిలో ఉన్న వీరన్న తలకు తీవ్ర గాయాలు కావడంతో అంబులెన్స్‌లో హనుమకొండలోని ఓ ప్రైవేట్ దవాఖానకు తరలించారు. ఎడ్లు కూడా గాయపడ్డాయి. డ్రైవర్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్సై ప్రశాంత్ తెలిపారు.

శిథిలావస్థలో హాస్టల్ భవనం

- అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారుతున్న వైనం
- పట్టించుకోని అధికారులు

దేశాయిపేటలోని ప్రభుత్వ సాంఘిక సంక్షేమ హాస్టల్ భవనం


గోడలకు ఏర్పడుతున్న పగుళ్లు

పోచమ్మమైదాన్, జనవరి 19: వరంగల్ దేశాయిపేటలోని సాంఘిక సంక్షేమ హాస్టల్ భవనం శిథిలావస్థకు చేరుతున్నది. మరమ్మతులపై అధికారులు దృష్టి సారించకపోవడంతో అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారుతున్నదని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. గతంలో విద్యార్థులతో కళకళలాడిన హాస్టల్ భవనం నేడు నిరుపయోగంగా మారడంతో అధ్వాన దశకు చేరుతున్నది. వివరాల్లోకి వెళ్తే.. షెడ్యూల్డ్ కులాల విద్యార్థుల కోసం 2003 జూన్ 1న అప్పటి ఎమ్మెల్యే బస్వరాజు సారయ్య భవన నిర్మాణానికి భూమిపూజ చేసి పనులు చేపట్టారు. భవన నిర్మాణం పూర్తయిన తర్వాత నాడు ప్రభుత్వ పాఠశాల, ఎయిడెడ్ నెహ్రూ మెమోరియల్ స్కూల్ ఏర్పాటుతో ములుగు, ఏటూరునాగారం, మంగపేట, పరకాల, నర్సంపేట, జనగామ నుంచి వచ్చే విద్యార్థులకు అనువుగా ఉండేది. ఐదు నుంచి పదో తరగతి వరకు ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ విద్యార్థులు ఈ హాస్టల్ భవనంలో ఉంటూ చదువుకునేవారు. 15 ఏళ్లపాటు విద్యార్థులకు ఈ వసతి గృహం ఎంతో ఉపయోగపడింది. రానురాను విద్యార్థుల సంఖ్య తగ్గుముఖం పట్టడంతో హాస్టల్ నిర్వహణకు గడ్డు పరిస్థితులు ఏర్పడ్డాయి. దీంతో ఉపాధ్యాయులు, హాస్టల్ అధికారులు పట్టించుకోకపోవడంతో మూసివేసే దుస్థితికి చేరింది. 2021లో కొంతకాలం డిగ్రీ విద్యార్థులకు ఈ హాస్టల్ భవనాన్ని ఉపయోగించారు. ఆ సమయంలో భారీ వర్షాల వల్ల భవనం కూలిపోతుందనే భయంతో విద్యార్థులను తాత్కాలికంగా సమీపంలోని సీకేఎం కళాశాల భవనంలోకి తరలించారు. విద్యా సంవత్సరం పూర్తయిన తర్వాత ఈ భవనాన్ని నిరుపయోగంగా ఉంచారు. దీంతో క్రమంగా భవనం శిథిలావస్థలకు చేరుతున్నది. భవన నిర్మాణంలో లోపాల కారణంగా సముదాయం పూర్తిగా దెబ్బతిని అధ్వాన దశకు చేరింది. ఇందులో పని చేసే సిబ్బంది ఎక్కడ విధులు నిర్వహిస్తున్నారో తెలియని పరిస్థితి. గతేడాది ఈ భవనానికి మరమ్మతులు చేయించి, వరంగల్ తహసీల్దార్ కార్యాలయానికి ఉపయోగిస్తారని ప్రచారం జరిగింది. కలెక్టర్ కూడా భవన సముదాయాన్ని సందర్శించారు. మరమ్మతులు చేయించి వినియోగంలోకి తేవాలని ఆదేశించినా ఇంతవరకు కార్యరూపం దాల్చలేదు. ఇప్పటికైనా అధికారులు స్పందించి మరమ్మతులు చేయించి, ప్రభుత్వ హాస్టళ్లు, కార్యాలయాలకు ఉపయోగించాలని ప్రజలు కోరుతున్నారు.

నేడు బల్దియాలో గ్రీవెన్స్

వరంగల్, జనవరి 19: గ్రేటర్ కార్పొరేషన్ ప్రధాన కార్యాలయంలో సోమవారం గ్రీవెన్స్ నిర్వహించనున్నట్లు కమిషనర్ అశ్వినీ తానాజీ వాకడే తెలిపారు. ఫిర్యాదుదారులు కార్యాలయానికి రావాలని కోరారు. ఉదయం 11 గంటలకు అన్ని విభాగాల అధికారులు హాజరు కావాలని ఆదేశించారు.

నేడు కలెక్టరేట్‌లో గ్రీవెన్స్ రద్దు

ఖిలావరంగల్, జనవరి 19: కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించనున్న గ్రీవెన్స్‌ను పరిపాలనా పరమైన కారణాల వల్ల రద్దు చేస్తున్నట్లు కలెక్టర్ సత్య శారద ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలో ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలు ప్రక్రియ కొనసాగుతున్నందున అధికారులు సర్వేలో నిమగ్నమైనట్లు పేర్కొన్నారు. ప్రజలు నేడు కలెక్టరేట్‌కు రావొద్దని కోరారు.

బల్దియా ఉద్యోగులకు క్రికెట్ పోటీలు

హసన్‌పర్తి, జనవరి 19 : రేవంత్‌రెడ్డి ప్రభుత్వం క్రీడలకు పెద్దపీట వేస్తున్నట్లు ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు అన్నారు. గణతంత్ర దినోత్సవం సందర్భంగా బల్దియా ఉద్యోగ సిబ్బందికి క్రికెట్ పోటీలను రెడ్డిపురం శివారులోని వీఎస్ఎస్ గ్రౌండ్‌లో ఆదివారం మేయర్ గుండు సుధారాణితో కలిసి ఎమ్మెల్యే ప్రారంభించారు. అనంతరం ఎమ్మెల్యే, మేయర్ సరదాగా క్రికెట్ ఆడారు. కార్యక్రమంలో మున్సిపల్ సూపరింటెండెంట్ ఆనంద్ పాల్గొన్నారు.

'ఐక్య పోరాటాలకు సిద్ధం కావాలి'

కరీమాబాద్, జనవరి 19: కేంద్ర ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా ఐక్య పోరాటాలకు సిద్ధం కావాలని రైతు సంఘం జిల్లా కార్యదర్శి ఈసంపెల్లి బాబు పిలుపునిచ్చారు. కార్మిక, కర్షక ఐక్యత దినోత్సవం సందర్భంగా ఆదివారం ఉర్సుగుట్టలో సీఐటీయూ, అఖిల భారత రైతు సంఘం, వ్యవసాయ కార్మిక సంఘం సంఘాల ఆధ్వర్యంలో సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్రం లేబర్ కోడ్‌లను తీసుకొచ్చి రైతు, కార్మిక వర్గాన్ని నట్టేట ముంచేలా చేస్తున్నదని ధ్వజమెత్తారు. రైతాంగ, కార్మి చట్టాలను కాపాడేందుకు పోరాడాలని పిలుపునిచ్చారు. సమావేశంలో సీఐటీయూ, అఖిల భారత రైతు సంఘం, వ్యవసాయ కార్మిక సంఘం సభ్యులు పాల్గొన్నారు.

నేడు డయల్ యువర్ డీఎం

నర్సంపేట, జనవరి19: డయల్ యువర్ డీఎం కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించనున్నట్లు ఆర్టీసీ నర్సంపేట డిపో మేనేజర్ ప్రసూనలక్ష్మి ఆదివారం తెలిపారు. నర్సంపేట డిపో పరిధిలోని అన్ని గ్రామాలకు ఆర్టీసీ బస్సు సౌకర్యం కల్పించేందుకు ప్రజలు సలహాలు, సూచనలు చేసేందుకు నేడు సాయంత్రం 4 గంటల నుంచి 5 గంటల వరకు డయల్ యువర్ కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు. నియోజకవర్గంలోని ప్రజలు 9959226052, 7382926166 నంబర్లకు ఫోన్ చేసి సలహాలు, సూచనలు అందించాలని కోరారు.

28వ డివిజన్‌లో అభివృద్ధి పనులు ప్రారంభం

పోచమ్మమైదాన్, జనవరి 19: వరంగల్‌లోని 28వ డివిజన్‌లోని సంతోషిమాత కాలనీ-2లో అభివృద్ధి పనులను ఆదివారం ప్రారంభించారు. డివిజన్ అభివృద్ధికి రూ. 6 కోట్ల నిధులు మంజూరయ్యాయి. కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షుడు కురిమిళ్ల సంపత్, నాయకులు వలబోజు శ్రీనాథ్, రాణాసింగ్, భట్టు కృష్ణ, మాటేటి నవీన్, ఓరుగంటి హేమంత్, రాజు, సాయిలు, శ్రీను, ప్రవళిక, రేఖ, మమత పాల్గొన్నారు.

కారును ఢీకొన్న లారీ

కరీమాబాద్, జనవరి 19: కారును లారీ ఢీకొట్టిన ఘటన ఆదివారం రాత్రి మామునూరులోని 4వ బెటాలియన్ సమీపంలో జరిగింది. ఖమ్మం వైపు నుంచి వరంగల్‌కు వస్తున్న కారును వరంగల్ నుంచి ఖమ్మం వైపు వెళ్తున్న లారీ ఢీకొట్టింది. ఈ ఘటనలో కారు ముందు భాగం దెబ్బతిన్నది. కారు డ్రైవర్ సీటు బెల్ట్ ధరించడంతో ఎయిర్ బ్యాగ్స్ తెరుచుకొని ప్రాణాలతో బయటపడినట్లు స్థానికులు తెలిపారు.

గేట్‌వాల్వ్‌కు మరమ్మతులు

నర్సంపేట, జనవరి 19: పట్టణంలోని 1వ వార్డులో గేట్ వాల్వ్‌కు ఆదివారం కౌన్సిలర్ దేవోజు తిరుమల-సదానందం ఆధ్వర్యంలో మున్సిపల్ అధికారులు, సిబ్బంది మరమ్మతులు చేపట్టారు. వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయం పక్కన ఇటీవల సీసీరోడ్డు నిర్మించారు. ఈ క్రమంలో గేట్‌వాల్వ్ దెబ్బతిన్నది. వారం రోజులుగా కాలనీకి నీటి సరఫరా బంద్ కావడంతో స్థానికులు ఇబ్బంది పడుతున్నారు. ప్రజలు కౌన్సిలర్ దృష్టికి తీసుకెళ్లడంతో సిబ్బందితో కలిసి మరమ్మతులు చేయించారు.

మృతుల కుటుంబాలకు చేయూత

రాయపర్తి/ఖానాపురం, జనవరి 19: రాయపర్తి మండలంలోని వెంకటేశ్వరపల్లికి చెందిన గూబ వెంకటేశ్ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. పుట్టెడు దుఃఖంలో ఉన్న బాధిత కుటుంబాన్ని మహబూబాబాద్ జిల్లా తొర్రూరు మండలం వెలికట్టెలోని జడ్పీహెచ్‌ఎస్‌లో 2008-09లో పదో తరగతి విద్యాభ్యాసం పూర్తి చేసిన వెంకటేశ్ బాల్యమిత్రులు ఆదివారం పరామర్శించారు. అనంతరం వారికి ధైర్యం చెప్పి రూ. 22 వేల ఆర్థిక సాయం అందించారు. అలాగే, ఖానాపురం మండలంలోని మనుబోతులగడ్డకు చెందిన అమ్మ అశోక్ ఇటీవల మృతి చెందాడు. అతడి కుటుంబాన్ని బాల్యమిత్రులు పరామర్శించారు. అనంతరం మృతుడి పిల్లల పేరున పోస్టాఫీస్‌లో రూ. 50 వేలు ఫిక్స్‌డ్ డిపాజిట్ చేసి పాస్‌బుక్‌ను కుటుంబానికి అందించారు. కార్యక్రమంలో డాక్టర్ ఎస్‌కే మస్తాన్, తోటకూరి రాజు, శ్యామల, మధు, సుమన్, ఐలోని, శ్రీను, రవి, రాజశేఖర్, రాము, రవీందర్, రాజేశ్ పాల్గొన్నారు.

చెన్నమల్ల నర్సయ్య సేవలు చిరస్మరణీయం

సభలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి

నల్లబెల్లి, జనవరి 19: నారక్కపేట గ్రామాభివృద్ధిలో మాజీ సర్పంచ్ చెన్నమల్ల నర్సయ్య సేవలు చిరస్మరణీయమని నర్సంపేట మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి అన్నారు. గ్రామంలో ఆదివారం నర్సయ్య ప్రథమ వర్ధంతి సభ నిర్వహించారు. ఈ సందర్భంగా పెద్ది హాజరై మాట్లాడారు. విప్లవ పార్టీతో మొదలైన తన రాజకీయ జీవితంలో వార్డు మెంబర్‌గా, ఉపసర్పంచ్‌గా, పీఏసీఎస్ డైరెక్టర్‌గా, సర్పంచ్‌గా గ్రామ సమస్యలను పరిష్కరించడంలో ప్రధాన భూమిక పోషించాడని కొనియాడారు. ఆయన పేదల మనిషిగా మంచి పేరు తెచ్చుకున్నారని గుర్తుచేశారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు బానోత్ సారంగపాణి, పీఏసీఎస్ చైర్మన్ చెట్టుపల్లి మురళీధర్, మాజీ వైస్ ఎంపీపీ గందె శ్రీనివాస్‌గుప్తా, కక్కెర్ల శ్రీనివాస్‌గౌడ్, మామిండ్ల మోహన్‌రెడ్డి, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పెద్ది పరామర్శ

నర్సంపేట: మండలంలోని పలు గ్రామాల్లో బాధిత కుటుంబాలను నర్సంపేట మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి పరామర్శించారు. బీఆర్‌ఎస్ లక్నేపల్లి గ్రామ అధ్యక్షుడు పాత్కాల కొమ్మాలు తల్లి నర్సమ్మ ఇటీవల మృతి చెందింది. బాధిత కుటుంబాన్ని పెద్ది పరామర్శించారు. పార్టీ చంద్రయ్యపల్లి సీనియర్ నాయకుడు భాషబోయిన బక్కయ్య తండ్రి ఐలయ్య మరణించగా, ఆయన కుటుంబాన్ని పరామర్శించారు. పార్టీ రాజేశ్వర్‌రావుపల్లి నాయకుడు, మాజీ వార్డు సభ్యుడు సోడ మల్లేశ్ తల్లి సాంబ ఇటీవల మృతి చెందగా, బాధిత కుటుంబ సభ్యులను పెద్ది పరామర్శించి ధైర్యం చెప్పారు. పెద్ది వెంట బీఆర్‌ఎస్ క్లస్టర్ ఇన్‌చార్జి కోమాండ్ల గోపాల్‌రెడ్డి, మాజీ సర్పంచ్‌లు గోనె యువరాజు, గొడిశాల రాంబాబుగౌడ్, మాజీ ఎంపీటీసీలు పెద్ది శ్రీనివాస్‌రెడ్డి, రాజు, మాజీ ఉప సర్పంచ్ పరాచికపు సంతోష్‌కుమార్, వీరన్న పాల్గొన్నారు.

ఎస్సీ వర్గీకరణను తక్షణమే అమలు చేయాలి

- ఎమ్మార్పీఎస్ నేతల డిమాండ్
- 'లక్ష డప్పులు.. వేల గొంతుకలు' ర్యాలీ, ప్రదర్శన

ఖిలావరండగల్ నుంచి ర్యాలీ నిర్వహిస్తున్న డప్పు కళాకారులు

ఖిలావరంగల్, జనవరి 19: ఎస్సీ వర్గీకరణను తక్షణమే అమలు చేయాలని డిమాండ్ చేస్తూ లక్ష డప్పులు.. వేల గొంతుకలు ప్రదర్శన, బహిరంగ సభను విజయవంతం చేయాలని కోరారు. ఈ మేరకు ఆదివారం డప్పు కళాకారుల సంఘం ఆధ్వర్యంలో పడమరకోట నుంచి పెంట్రోల్ పంపు జంక్షన్ వరకు డప్పులతో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఐత అనిల్, మైదం రవన్న, మైదం బాబు, గొర్రె నరేశ్, దుబాకి బాబు, గొర్రె లడ్డూ, మైదం అరుణ్, బరిగెల రాజు, కేశపాక రాజు, నలిగంటి ప్రేమ్‌సాగర్, అశోక్, కందికట్ల నాగరాజు పాల్గొన్నారు.

'డప్పు ప్రదర్శనను విజయవంతం చేయాలి'

చెన్నారావుపేట: హనుమకొండలో సోమవారం నిర్వహించనున్న డప్పు ప్రజా ప్రదర్శనను విజయవంతం చేయాలని ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు బొమ్మెర రవీందర్ పిలుపునిచ్చారు. ఉప్పరపల్లిలో డివిజన్ అధ్యక్షుడు అబ్బదాసి యాకయ్య ఆధ్వర్యంలో ఆదివారం డప్పు కళాకారులు ప్రదర్శన ఇచ్చారు. నేడు హనుమకొండలోని వేయిస్తంభాల గుడి నుంచి అంబేద్కర్ సెంటర్ వరకు డప్పుల ప్రజా ప్రదర్శన ఉంటుందన్నారు. ఎమ్మార్పీఎస్, ఎమ్మెస్పీ డప్పు కళాకారులు, కవులు, గాయకులు అధిక సంఖ్యలో హాజరు కావాలని కోరారు. కార్యక్రమంలో చిలపాక పెద్ద యాకయ్య, బొమ్మెర కొమ్మాలు, నమిండ్ల అనిల్, గూడెల్లి రాజు, జన్ను రవి, బరుపట్ల వీరేశం, ప్రవీణ్, జైభీమ్ అధ్యక్షుడు సుమన్ పాల్గొన్నారు.

ఎస్సీ వర్గీకరణ అమలు చేయాలి

సంగెం: ఎస్సీ వర్గీకరణను తక్షణమే అమలు చేయాలని ఎమ్మార్పీఎస్ ఇన్‌చార్జి బిర్రు మహేందర్ మాదిగ డిమాండ్ చేశారు. లక్ష డప్పులు.. వేల గొంతుకలు మహా ప్రదర్శనను విజయవంతం చేయాలని కోరుతూ సంగెం మాజీ సర్పంచ్ గుండేటి బాబు ఆధ్వర్యంలో డప్పులతో ప్రదర్శన ఇచ్చారు. మండలాధ్యక్షుడు దామెర కిశోర్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో రాష్ట్ర ఉపాధ్యక్షుడు చాతాళ్ల రమేశ్, జిల్లా అధ్యక్షుడు కట్ల రాజశేఖర్, మాజీ జడ్పీటీసీ సారంగపాణి, సదిరం రవికుమార్, కోడూరి రాజు, మాజీ సర్పంచ్ ఎల్లయ్య, సారంగం పాల్గొన్నారు.

వర్ధన్నపేటలో సమస్యలు పరిష్కరించాలి

ఎమ్మెల్యేను కోరిన ప్రజా సంఘాల నేతలు

ఎమ్మెల్యేకు వినతిపత్రం ఇస్తున్న నాయకులు

వర్ధన్నపేట, జనవరి 19: నియోజకవర్గ కేంద్రంలోని సమస్యలు పరిష్కరించాలని ప్రజా సంఘాల నేతలు కోరారు. ఈ మేరకు ఎమ్మెల్యే కేఆర్ నాగరాజును ఆదివారం తెలంగాణ అంబేద్కర్ సంఘం జిల్లా అధ్యక్షుడు కంజర్ల మహేశ్ ఆధ్వర్యంలో కలిసి వినతిపత్రం అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ వర్ధన్నపేటలో అసంపూర్తిగా ఉన్న ఇంటిగ్రేటెడ్ మార్కెట్ భవనాన్ని పూర్తి చేయించి చిరు వ్యాపారులకు సహకారం అందించాలని కోరారు. అలాగే, ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు నూతన భవనం నిర్మించడంతో పాటు ప్రభుత్వ ఏరియా ఆసుపత్రికి వైద్యాధికారిని నియమించాలన్నారు. వైద్య సిబ్బంది పేదలకు మెరుగైన వైద్య సేవలు అందించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. వర్ధన్నపేటను రెవెన్యూ డివిజన్‌గా ఏర్పాటు చేసి ప్రభుత్వ కార్యాలయాలు, గురుకులాలు ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో టీఏఎస్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ నర్సయ్య, సంఘం నాయకులు భాస్కర్, కుమార్, వివేక్, రాజు, గణేశ్, మంజునాథ్, రమేశ్, ప్రభాకర్ పాల్గొన్నారు.

జాతీయస్థాయి పోటీలకు ఆర్డీఎఫ్ విద్యార్థులు


జాతీయ పోటీలకు ఎంపికైన విద్యార్థులు

పర్వతగిరి, జనవరి 19: ఎన్టీపీసీ 44వ జూనియర్ విలువిద్య రాష్ట్రస్థాయి పోటీల్లో ఆర్డీఎఫ్‌కు చెందిన ముగ్గురు విద్యార్థులు ప్రతిభ కనబరిచి జాతీయస్థాయికి ఎంపికైనటట్లు ఆర్డీఎఫ్ కళాశాల ప్రిన్సిపాల్ ఆడెపు జనార్దన్ తెలిపారు. రంగారెడ్డి జిల్లా కొల్లూరులో జరిగిన ఎంపిక పోటీల్లో రికర్వ్ విభాగంలో బాల్లె గంగరాజు ప్రథమ స్థానం, ముంజాల స్ఫూర్తి ద్వితీయ స్థానంలో నిలిచారు. ఇండియన్ రౌండ్ విభాగంలో బాల్లె వినయ్ నాలుగో స్థానంలో నిచిలింది. ఎంపికైన క్రీడాకారులు ఫిబ్రవరి 10 నుంచి 16వ తేదీ వరకు కోల్‌కతాలో జరగనున్న జాతీయస్థాయి పోటీల్లో పాల్గొంటారని తెలిపారు. వారిని ఆర్చరీ కోచ్ రేణు మండల్, వైస్ ప్రిన్సిపాల్ ఏ రాజు, అధ్యాపకులు అభినందించారు.

మృతుడి కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న నన్నపునేని

బాధితులకు నరేందర్ పరామర్శ

కరీమాబాద్, జనవరి 19: వరంగల్ ఫోర్ట్‌రోడ్డు ప్రాంతంలోని సమ్మయ్య హోటల్ యజమాని కుమారుడు మరణించాడు. విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే నన్నపునేని నరేందర్ ఆదివారం మృతుడి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించి ధైర్యం చెప్పారు. ఆయన వెంట బజ్జూరి వాసు, గొర్రె చేరాలు ఉన్నారు.

మాజీ ఎమ్మెల్యే నన్నపునేనిని కలిసిన నాయకులు

పోచమ్మమైదాన్: ఖిలావరంగల్ మార్బుల్స్ అండ్ టైల్స్ యూనియన్ నాయకులు మాజీ ఎమ్మెల్యే నన్నపునేని నరేందర్‌ను కలిశారు. ఈ సందర్భంగా తమ సమస్యలను నరేందర్‌కు విన్నవించారు. కార్యక్రమంలో యూనియన్ అధ్యక్షుడు జన్ను సునీల్, జన్ను యాదగిరి, ప్రమోద్, బాబురావు, నాగరాజు, రంజిత్, అలీ పాల్గొన్నారు.

గుడుంబా తరలిస్తున్న వ్యక్తుల అరెస్ట్

ఖానాపురం/గీసుగొండ, జనవరి 19: ద్విచక్ర వాహనంపై గుడుంబా తరలిస్తున్న వ్యక్తిని ఎక్సైజ్ అధికారులు అరెస్ట్ చేశారు. ఎక్సైస్ సీఐ నరేశ్‌రెడ్డి కథనం ప్రకారం.. బుధరావుపేట శివారులో ఆదివారం ఎక్సైజ్ పోలీసులు వాహన తనిఖీలు చేపట్టారు. నాజీతండాకు చెందిన భూక్యా హుస్సేన్ ద్విచక్ర వాహనంపై పది లీటర్ల గుడుంబాను తరలిస్తుండగా పట్టుకున్నారు. అతడిపై కేసు నమోదు చేసి, ద్విచక్ర వాహనం, పది లీటర్ల గుడుంబాను స్వాధీనం చేసుకున్నట్లు సీఐ తెలిపారు. తనిఖీల్లో సిబ్బంది దిలీప్, నాగరాజు పాల్గొన్నారు. అలాగే, గీసుగొండ మండలంలోని జాన్‌పాక, నందనాయక్‌తండాలో గుడుంబా రవాణా చేస్తున్న వాంకుడోత్ అఖిల్, గండ్రకోట విజయ, సురేశ్, తేజావత్ కస్నా, రాజును పట్టుకున్నట్లు ఎక్సైజ్ సీఐ తాతాజీ తెలిపారు. వీరి నుంచి 40 లీటర్ల గుడుంబా, సెల్‌ఫోన్లు, బైక్‌లను స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు.


కరీమాబాద్: ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొన్న పూర్వ విద్యార్థులు

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

కరీమాబాద్, జనవరి 19: సుమారు 25 ఏళ్ల క్రితం కలిసిమెలిసి చదువుకున్న విద్యార్థులు ఒకచోట చేరారు. సరదాగా ఆడిపాడి ఆనందంగా గడిపారు. చిన్ననతనంలో జరిగిన జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. ఎస్ఆర్ఆర్‌తోటలోని వాణి విద్యానికేతన్ పాఠశాలలో 1999-2000 బ్యాచ్ ఎస్సెస్సీ విద్యార్థులు ఆదివారం పాఠశాలలో ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యాబుద్ధులు నేర్పిన గురువులను సత్కరించారు.

ధర్మారం జడ్పీహెచ్ఎస్‌లో..

గీసుగొండ: మండలంలోని ధర్మారం జడ్పీహెచ్ఎస్‌లో 1996-97 బ్యాచ్ టెన్త్ విద్యార్థులు బండి రాజ్‌కుమార్, ఆకుతోట రాజు, విక్రమ్ ఆధ్వర్యంలో మల్లూరు లక్ష్మీనర్సింహస్వామి ఆలయ ప్రాంగణంలో ఆత్మీయ సమ్మేనం నిర్వహించారు. ఈ సందర్భంగా చిన్ననాటి జ్ఞాపకాలను ఒకరినొకరు పంచుకున్నారు.

కావ్యకు పూలమొక్క అందజేస్తున్న ఐఎంఏ ప్రతినిధులు

ఎంపీని కలిసిన ఐఎంఏ ప్రతినిధులు

వరంగల్‌చౌరస్తా, జనవరి 19: వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్యను ఇండియన్ మెడికల్ అసోసియేషన్(ఐఎంఏ) వరంగల్ నూతన కార్యవర్గ ప్రతినిధులు ఆదివారం హనుమకొండలోని ఎంపీ క్యాంపు కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆమెకు పూలమొక్క అందించి శాలువాతో సత్కరించారు. ఐఎంఏ అధ్యక్షుడు డాక్టర్ నాగార్జునరెడ్డి, కార్యదర్శి డాక్టర్ అజిత్ అహ్మద్, కోశాధికారి డాక్టర్ శిరీశ్‌కుమార్, డాక్టర్ ముష్క దిలీప్‌కుమార్, ఎలెక్టెడ్ ప్రెసిడెంట్ డాక్టర్ మన్మోహన్‌రాజ్, తెలంగాణ మెడికల్ కౌన్సిల్ జిల్లా ఉపాధ్యక్షుడు డాక్టర్ నరేశ్‌కుమార్ పాల్గొన్నారు.

శిక్షణను సద్వినియోగం చేసుకోవాలి

కరీమాబాద్, జనవరి 19: శిక్షణ సద్వినియోగం చేసుకోవాలని పోలీస్ ట్రైనింగ్ కళాశాల ప్రిన్సిపాల్ పూజ కానిస్టేబుళ్లకు సూచించారు. మామునూరులోని పోలీస్ ట్రైనింగ్ కళాశాలలో ఆదివారం శిక్షణ ముగింపు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పూజ మాట్లాడుతూ సిబ్బంది పోలీస్ శాఖకు మంచి పేరు తీసుకురావాలని సూచించారు. విధి నిర్వహణలో అప్రమత్తంగా ఉండాలన్నారు.

చాంబర్ పరిధిలో కార్మికుల వేతనాలు పెంపు

కాశీబుగ్గ, జనవరి 19: వరంగల్ ఎనుమాముల వ్యవసాయ మార్కెట్ పరిధిలోని వివిధ షాపులు, పరిశ్రమల్లో పని చేస్తున్న గుమస్తాలు, హమాలీలు, ఇతర కార్మికుల వేతనాలు పెంచినట్లు చాంబర్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీస్ అధ్యక్షుడు బొమ్మినేని రవీందర్‌రెడ్డి తెలిపారు. లక్ష్మీపురంలోని చాంబర్ కార్యాలయంలో ఆదివారం వివిధ కార్మికుల సమక్షంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్మికుల అభ్యర్థన మేరకు చాంబర్ పాలకవర్గం ఆధ్వర్యంలో అన్ని రకాల వ్యాపార వర్గాలతో మాట్లాడినట్లు చెప్పారు. పెరిగిన ధరలను దృష్టిలో పెట్టుకొని ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. సమావేశంలో చాంబర్ మాజీ అధ్యక్షుడు కటకం పెంటయ్య, ఉపాధ్యక్షుడు మొగిలి చంద్రమౌళి, ప్రధాన కార్యదర్శి మడూరి వేదప్రకాశ్, సాగర్ల శ్రీనివాస్, అల్లె సంపత్ పాల్గొన్నారు.

'పెన్షనర్ల బెనిఫిట్స్ వెంటనే చెల్లించాలి'

కాశీబుగ్గ, జనవరి 19: రాష్ట్ర ప్రభుత్వం పెన్షనర్స్ బెనిఫిట్స్‌ను వెంటనే చెల్లించాలని పెన్షనర్స్ అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు వెలిశోజు రామమనోహర్ డిమాండ్ చేశారు. పెన్షనర్స్ అసోసియేషన్ కాశీబుగ్గ యూనిట్ అధ్యక్షుడు తుమ్మ వీరయ్య అధ్యక్షతన ఆదివారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన లైఫ్ సర్టిఫికెట్‌తోపాటు ఇన్‌కాం టాక్స్‌కు సంబంధించిన వివరాలను క్లుప్తంగా వివరించారు. తమ ఫోన్ల ద్వారా లైఫ్ సర్టిఫికెట్ ఎలా సమర్పించాలో తెలిపారు. ప్రతి నెల రెండో ఆదివారం పెన్షనర్లతో సమావేశం నిర్వహిస్తున్నట్లు చెప్పారు. సీపీఎస్ విధానాన్ని రద్దు చేసి, పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని డిమాండ్ చేశారు. తమ సమస్యలు పరిష్కరించకుంటే ఉద్యమిస్తామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు.

మండల ఓంకారమూర్తికి నివాళి

పోచమ్మమైదాన్, జనవరి 19: వివేకానంద యోగా సేవా సంస్థలో దశాబ్దాల తరబడి సేవలు అందించి, ఇటీవల మృతి చెందిన మండల ఓంకారమూర్తికి పలువురు నివాళులర్పించారు. ఎల్‌బీనగర్‌లోని పద్మశాలీ ఫంక్షన్ హాల్‌లో ఆదివారం వివేకానంద ఆర్థిక సహకార సంఘం ఆధ్వర్యంలో ఆయన సంస్మరణ సభ నిర్వహించారు. సంస్థ శాశ్వత అధ్యక్షుడు సుదర్శన్ ఆయన సేవలను కొనియాడారు.